# ఒంటరి రాజు

ఎన్. కృష్ణరావు

అనంత నీలాకాశాన్ని—దాని క్రింద విశాల సముద్రాన్ని—అవి రెండూ కలసి చుంబించు తున్నట్లు కనిపించే దూరాన్ని—ఒంటరిగా దేదీప్యమానంగా వెలిగే జాబిల్లిని—వువ్వునీటిలో స్థిరత్వంలేక అల్లల్లాడుతున్న ప్రతిబింబాన్ని—తాటితోపుల్లోంచి మల్లెపువ్వుల్లాంటి వెన్నెట్లో ప్రతి నిముసమూ కనుపించే కెరటాల నురుగుని-చేపలకై ఎగురుతున్న కనీకనుపించని పక్షుల్ని—చూస్తూ కదలకుండా, మెదలకుండా కిటికీదగ్గర నిలబడివుండిపోయాడు రాజు.........!

నిజానికి రాజుకి అవాళ వొంట్లో అదో మాదిరిగా వుంది. మనసులో ఏవేవో తలంపులు, భావాలూ—ఒకటి తరువాత వొకటి కమ్ముకుంటున్నాయి. ఆ చీకాకులో తన యజమానికి తనకు తెలియకుండానే ఎదురుజవాబు చెప్పాడు. అది తలచుకొంటుంటే రాజుకి మరీ ఆందోళనగా వుంది।

అవాళ "బేదింగ్ బ్యూటీ" ఆఖరురోజని—మొదట ఒకమారు చూచినా—మరీబాగుండడమువల్ల రూములోవున్న నలుగురూ వెళ్దామనుకున్నారు మొదట. కాని వెళ్ళే ముందు రాజు రాను- అనడంవల్ల మిగిలిన ముగ్గురు స్నేహితులూ పిక్చర్ చూడాలనే వుబలాటంకొద్దీ రాజుని విడని వెళ్లిపోయారు—రెండో ఆటకి.

అందరితో రాజు భోజనము చేసేదేకాని-తనేం తింటున్నాడో తెలియకుండానే రెండు మెతుకులు నంజాడు. అంతే—రాజు డబ్బాలాగ వాగుతూ-తన స్నేహితులని నవ్వించే రాజు—అవాళ-తన స్నేహితులు తలంచినట్లు కారణం లేకనే అలా మౌనం వహించడం—వాళ్ళని కొంచెం ఆశ్చర్యపరచింది.

రాజు అలా కిటికీదగ్గర నిలబడి రాతివిగ్రహంలా ప్రకృతి సౌందర్యాన్ని ఆ జాబిల్లి వెలుతురులో తిలకించి తన్మయుడౌతున్నాడో—లేక ఆ ప్రకృతి సౌందర్యమే తన చీకాకుకు ఆజ్యం పోస్తుందో—ఆ స్థితిలో వున్నవారికే తెలుస్తుందేమొ !

ఒకరి భావాలూ, వూహలూ ఒకరు అర్థం చేసుకోకపోబట్టే కాబోలు యీ కల్లోలం యీ రక్తపాతం।—అందుకనే కాబోలు రాజు పొందుతున్న ఆవేదన తెలియకేకాబోలు స్నేహితులు ఒంటరిగా విడచిపెట్టి—సినీమాకి, రాజు చీకాకుతో సంబంధం తమకు లేనట్లు వెళ్ళిపోయారు—ప్రపంచం అంతా యింతేనేమో।

నిరుడే రాజు వివాహం చేసుకున్నాడు—అదికూడా తనకి నచ్చిన పిల్లే దొరికింది. తన జీవితాంతంవరకు తన సేవ చేయనున్న అర్థాంగి. తనకు నచ్చినది—తన Ideas—లోకానికి వ్యతిరేకంగా కనిపించినా—తన భార్యకుకూడా వుండడం—అదృష్టమే అనుకున్నాడు. అంత అదృష్టవంతుడు యీ విశాల ప్రపంచంలో లేడనికూడా తలచేడు।

నిండు చంద్రుడు ప్రకాశిస్తూన్నాడు—వొంటరిగా నీ వొంటరితనం నేను సహించలేనన్నట్లుగా ఒక పెద్ద నల్లని మేఘం చందమామని కప్పివేసింది. ఇంతసేపు రాజు చూస్తూన్న విశాల సముద్రం—ఆ నురుగు—ఆ చుంబనం—ఆఖ




రికి తాటిచెట్లు ఆ కారుచీకటిలో కలసిపోయి కనుపించడంలేదు!

కాని రాజు తన కలాంటి వార్త వస్తుందని—అనుకోలేదు—కనీసం తలచలేదు—చంద్రుడు కనుపించడంలేదు — రాజుమట్టుకు ఆ అనంతాన్ని—దానిలో దేనినో—ఆశాజ్యోతిని కారు చీకటిలో చూస్తున్నట్టు చూస్తున్నాడు....

ఆ రోజు మొదట మొదటు పోష్టుమాన్ ఉత్తరం యిస్తుంటే నవ్వుముఖం పెట్టాడు—కాని ఆ ఉత్తరం చదివేటప్పటికి—యింకేముంది—తన భార్యకు హటాత్తుగా గుండెజబ్బు వచ్చిందని—తరువాత టెలిగ్రాం—భార్య—తనప్రియమైన భార్య చనిపోయిందని—అంతే—యీ సంగతి తన స్నేహితులకి చెప్పలేదు—చెప్పినా లాభమేమిటని కాబోలు వూరుకున్నాడు!

నల్లటి మేఘం మెల్లి మెల్లిగా వెళ్లిపోతూంది—కొంచెం కొంచెం వెల్తురు వస్తూంది. ఇంకా రాజు నిలబడి అలానే ఆలోచిస్తున్నాడు. తాను యిప్పుడు ఏకాకిగా — జీవితంలో తోడు లేనప్పుడు....

మేఘం వెళ్ళిపోయింది. మళ్ళ యధారీతిగా జాబిల్లి వెలుతురు—తాటి తోపుల్లోంచి నురుగు—అకాశ సముద్ర చుంబనం—ఈమారు సముద్రపు ఘోషకూడా వినబడుతూంది....

అంతా నిశ్శబ్ధం—కాని అక్కడక్కడ కుక్కల మొరుగులు—గుడ్లగూబల మూలుగులు—సముద్రపుఘోష—ఆ—అనంతం—ఒంటరి రాజు!

---

## పత్రికా ప్రదర్శనం

ఈ సెప్టెంబరు 1వ తేదిన విజ్ఞాన సమితి ద్వితీయ వార్షికోత్సవ సందర్భాన మన రాజధానిలో వెలువడు అన్ని భాషల పత్రికలు ప్రదర్శించుటకు ఏర్పాటు జరిగింది. పత్రికాధిపతులు నమూనా పత్రికలు వెంటనే పంపించి, ఈ ఉద్యమాన్ని జయప్రదమొనర్పగోరుతున్నాము.

యద్దనపూడి సూర్యనారాయణమూర్తి,
కార్యదర్శి.

తాడేపల్లి గూడెం,
ప॥ గోదావరిజిల్లా.